యాసంగి పంట పండింది..

- ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి
- చివరి దశలో నీటికి ఇబ్బంది అయినా తగ్గని దిగుబడి



ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు



సారంగాపూర్‌లో సాగు చేసిన జేజీఎల్ 24423 రకం వరి పంట

సారంగాపూర్: చిన్న చిన్న ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినా యాసంగిలో రైతులు మాత్రం వరి ,పంటలో ఊహించని విధంగా దిగుబడి సాధించారు. హైబ్రిడ్ వరి వంగడాలను సాగుచేసినా, సాధారణ రకాలు సాగుచేసిన రైతులు కూడా ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి సాధించినట్లు చెబుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద డీ–53 కాలువ ద్వారా సాగునీటితో పాటు, బీర్‌పూర్ మండలంలో రోళ్ల వాగు ప్రాజెక్టు నుంచి అందిన సాగునీరు, గోదావరి వెంట ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు, రెండు మండలాల్లో విద్యుత్ పంపుసెట్ల కింద పంటలు సాగుచేశారు. కొన్ని గ్రామాల్లో చివరి భూములకు సాగునీరు సక్రమంగా అందకపోవడం , బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోవడం, దిగుబడి తగ్గినా కూడా 90 శాతం మంది రైతులు వరిలో అధిక దిగుబడి వచ్చింది.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో వరిసాగు ఇలా..

సారంగాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 11,255 ఎకరాల్లో, బీర్‌పూర్ మండలంలో 17 గ్రామాల్లో 10020 ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులు హైబ్రిడ్ విత్తనాలు నాటినా, సాధారణ విత్తనాలు నాటినా దిగుబడి మాత్రం ఎకరాకు 30 క్వింటాళ్లకు తగ్గలేదు. రైతులు దొడ్డు రకాల్లో ఏ విత్తనం నాటినా దిగబడి ఎకరాకు 30 క్వింటాళ్లు వచ్చినట్లు చెబుతున్నారు. సాధారణ రకాలు, హైబ్రిడ్ రకాలు, రిసెర్చ్ వంగడాలు ఏవీ సాగుచేసినప్పటికీ దిగబడి రైతు ఆశించిన దాని కంటే ఎక్కువ రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మంచి దిగుబడి సాధించాం



నాకు ఉన్న రెండెకరాలకు విద్యుత్ పంపుసెట్ల ద్వారా నీరు అందుతుంది. నా పొలంలో జేజీఎల్ 24423 దొడ్డు వరి రకాన్ని సాగుచేసాను.. ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. చాలా ఏళ్ల తరువాత మంచి దిగుబడులు వచ్చాయి. పురుగుల మందులు కూడా తక్కువగా పిచికారి చేశాం. సాగు ఖర్చులు తగ్గాయి.

– తోట మల్లయ్య, పెంబట్ల

చీడపీడలు తక్కువ



ఈ యాసంగిలో వరి పంటపై చీడపీడల ప్రభావం కూడా చాలా తక్కువగా ఉంది. నా భూమి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింది నీటితో సాగవుతుంది. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగబడి వచ్చింది. ఎంటీయూ 1010 రకం వరి సాగుచేశాను. వరి పంటలో గతేడాదితో పోలిస్తే పెట్టుబడి వ్యయం కూడా చాలా తక్కువైంది. ఈ సారి చాలామందికి లాభదాయకంగా ఉంది.

– బెజ్జంకి రమేశ్, పెంబట్ల

వాతావరణం అనుకూలించింది



వరి పంటలో ఆశించిన దిగుబడులు రావడానికి వాతావరణం ఈ రబీలో చాలా అనుకూలంగా ఉంది. చీడ పీడలు తక్కువగా ఆశించాయి. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం, అంతర్గత కృషితో పాటు, అధిక దిగుబడులు సాధించారు.

– ప్రదీప్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, సారంగాపూర్

కాంగ్రెస్ రైతు పక్షపాత ప్రభుత్వం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ రైతు పక్షపాతప్రభుత్వమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 15వ వార్డు శంకులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జగిత్యాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం నిరుపేదలకు ఎంతో వరంగా మారాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసిన రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి, నాయకులు గోలి శ్రీనివాస్, బాల ముకుందం, తోట మల్లికార్జున్, ఏవో శ్రీనివాస్, ఏఈ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం, దేహ ధారుద్యం

జగిత్యాలటౌన్: క్రీడలతో స్నేహభావం, శారీరక ధారుద్యం పెరుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని గీత విద్యాలయ మైదానంలో నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం ఎస్‌ఆర్‌బి గంగపుత్ర భీష్మ క్రికెట్ ట్రోఫీ 2025 ముగింపు వేడుకల్లో సోమవారం పాల్గొని విజేతలకు ట్రోఫీతో పాటు ప్రైజ్‌మనీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, రాజేశం, పవన్, రాజ్‌కుమార్, తిరుపతి, నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఆహ్వాన పత్రిక

జగిత్యాలటౌన్: శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని వేదపండితుడు నంబి వేణుగోపాలచార్య ఆహ్వానించారు. పట్టణంలోని ఇందిరాభవన్‌లో సోమవారం కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందించారు.

బొమ్మెనలో ముందస్తు బడిబాట

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. ఒకే రోజు 20 మంది విద్యార్థులు కొత్తగా పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మధుకర్, అంబటి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంకు మాదిగ జాతి రుణపడి ఉంటుంది



మాట్లాడుతున్న పిడమర్తి రవి

జగిత్యాలటౌన్: మాదిగల చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ చేసి, మాదిగలకు పెద్దదిక్కుగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగ జాతి రుణపడి ఉంటుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. జగిత్యాల పట్టణంలోని శివసాయి రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సంబరాలకు సోమవారం పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎందరో ముఖ్యమంత్రులు తీర్చలేని సమస్యను తీర్చడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి చారిత్రక నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు మెడపట్ల దుబ్బయ్య, గుడికందుల మహేశ్, గొర్రె రంజిత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: ఎస్సీ వర్గీకరణ సంబరాల కోసం సోమవారం జిల్లాకు విచ్చేసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవిని కోరుట్లలో నాయకులు సన్మానించారు. అనంతరం కొత్త బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు . కార్యక్రమంలో నాయకులు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, కిరణ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పరిశీలన



సర్వే చేస్తున్న అధికారులు

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక సర్వే కొనసాగుతోంది. సోమవారం గెజిటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే తీరుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు. మండలానికి కేటాయించిన 711 ఇళ్లకి ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఏవో లావణ్య, ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, జీపీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల కేటాయింపు కోసం మండలంలోని 19 గ్రామాల్లోని లబ్ధిదారులను ఎంపిక చేసి, ఎల్–1 జాబితా విడుదల చేయగా, సోమవారం ఎంపీడీవో స్వాతి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వివరాలు సేకరించారు. గతంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక జాబితా ప్రకారం మొదటి దశలో విడుదల చేసిన ఎల్–1 జాబితాలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, మరోసారి పరిశీలించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మల్యాల రాకేశ్

జగిత్యాలటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తూ విద్యను పూర్తి వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. అనుమతులు లేకుండా కొన్ని పాఠశాలలు నిర్వహిస్తున్నా డీఈవో పట్టించుకోవడం లేదన్నారు. వేసవి సెలవులు ఉన్నప్పటికీ ఇంటర్ క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యారంగ సమస్యలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో నగర కార్యదర్శి కుందారపు రాజు, జోనల్ ఇంచార్జి రాపాక నిఖిల్, సంయుక్త కార్యదర్శి మనోజ్, హరీశ్ పాల్గొన్నారు.

యాదవుల సమస్యలపై పోరాడుదాం



సభ్యత్వం ఇస్తున్న మల్లేశ్ యాదవ్

మెట్‌పల్లిరూరల్: యాదవుల సమస్యలపై ఒక్కటై పోరాడుదామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గణవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లులలో సోమవారం యాదవ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 66 మంది ఈ కమిటీలో సభ్యత్వం తీసుకోగా వారికి సభ్యత్వ రశీదులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన యాదవులకు దక్కాల్సిన హక్కులు,తదితర విషయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో చిన్నయ్య,శంకర్,నాగేశ్,లింబాద్రి,వెల్లుల యాదవ సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు సిద్ధం కావాలని మండలాధ్యక్షుడు మల్యాల మారుతి కోరారు. మండలంలోని భూషణరావుపేటలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బూత్‌స్థాయి బాధ్యులు, శక్తి కేంద్రాల బాధ్యులు అందరిని సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, పల్లె గంగాధర్, బత్తిని మహేశ్, గజబీంకార్ ప్రవీణ్, గాంధారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హమాలీలు రాక నిలిచిన కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

కథలాపూర్: మండలం లోని భూషణరావుపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయినట్లు రైతులు తెలిపారు. హమాలీలు నాలుగు రోజుల క్రితం వెళ్లిపోవడంతో ఈ సమస్య తలెత్తిందని రైతులు అంటున్నారు. హమాలీలు లేకపోతే ఇతర గ్రామాల నుంచి తెప్పించి తూకం వేయించాల్సిన నిర్వాహకులు, అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. వర్షం కురిస్తే నష్టపోతామని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాఠశాలలకు గుర్తింపు ఇవ్వొద్దు



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

జగిత్యాల: ఇటీవల కాలంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను కొనసాగిస్తున్నారని, వారికి అనుమతి ఇవ్వొద్దని ఏఐఎస్‌ఎఫ్ జగిత్యాల జిల్లా సమితి నాయకులు డీఈవో రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మెట్‌పల్లి కేంద్రంలో నూతన బ్రాంచ్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యాస, రవీంద్ర పాఠశాలలకు ధ్రువీకరణ పత్రాలు అందించారని, వాటికి సరైన సౌకర్యాలు లేవని తెలిపారు. వారికి అనుమతులు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అక్రమాలిక్, అరవింద్, నవీన్, సులేమాన్, దిల్సన్ పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యతలను పెంచుతుంది



కానిస్టేబుల్‌కు స్టార్స్ అందజేస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: ఉద్యోగులకు పదోన్నతి బాధ్యతలను పెంచుతుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వెంకటేశ్ గౌడ్ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పదోన్నతి బ్యాడ్జ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖ పట్ల నమ్మకం, గౌరవం పెరిగేలా పనిచేయాలన్నారు.

పుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు



జరిమానా విధిస్తున్న అధికారులు

మెట్‌పల్లి: పట్టణంలో రహదారులు, పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ అన్నారు. సిబ్బందితో కలిసి సోమవారం జాతీయ రహదారికి ఇరువైపులా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపైనా వ్యాపారాలు నిర్వహిస్తున్న పలువురికి జరిమానా విధించారు. ఆక్రమణలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, వ్యాపారులు దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ముజీబ్, నాయక్, మహిపాల్, లింబయ్య ఉన్నారు.

సోమేశ్వర కొండ వద్ద భక్తుల సందడి



అన్నదానం చేస్తున్న గంగాధర్ దంపతులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ కనక సోమేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు కోనేటి స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. చిట్టాపూర్ గ్రామానికి చెందిన సామల్ల గంగాధర్–సరళ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగ రాజన్న, ఆలయ ప్రధానార్చకులు బల్యపెల్లి ప్రభాకర్‌శర్మ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, సభ్యులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

మేడిపల్లి: వరి కొయ్యకాలను కాల్చడం పర్యావరణానికి నష్టమని ఏవో ఎండీ షాహిద్ అలీ అన్నారు. మండలంలోని కాచారం, కొండాపూర్, విలయతబాద్ గ్రామాల్లో రైతులు వరి కొయ్యలు కాలుస్తున్నారనే సమాచారంతో సోమవారం ఆయా గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించారు. వరి కొయ్యలు కాల్చితే పంటకు అవసరమయ్యే జీవరాశులు,నేల స్వభావం మారిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, ఆర్‌ఐ రమేశ్, వ్యవసాయాధికారులు సురేందర్ నాయక్, మంజుల, రైతులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ నుంచి బొమ్మెన వెళ్లే రూట్‌లో గంభీర్‌పూర్ గ్రామశివారులో రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణగా గోడలు లేక ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు ఫ్యూజ్‌ల కోసం ఏర్పాటు చేసిన వైర్లు అటువైపు వెళ్లే పశువులకు తాకే ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తెలిపారు. రాత్రివేళ అటువైపు వెళ్లేవారు వాటిని గమనించకపోతే ప్రమాదం బారిన పడతారని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: భూమేశ్వర్
ట్రాన్స్‌కో ఏఈ, అంబారిపేట సెక్షన్, సెల్ నంబర్ : 7901045427

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రోడ్డుకు అడ్డంగా గోడ కడుతున్నా.. పట్టించుకోరా



నిరసన తెలుపుతున్న మహిళలు

మల్లాపూర్: రోడ్డు కబ్జా చేసి అడ్డంగా గోడ నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ దళిత మహిళలు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. మండలంలోని మొగిలిపేటలో 40 ఏళ్లుగా ప్రజలు వినియోగించుకుంటున్న పబ్లిక్ రోడ్డును కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని పంచాయతీ అధికారులకు 7 నెలలుగా పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డును కబ్జా చేసి అడ్డంగా గోడ నిర్మాణం చేపడుతున్న అక్రమార్కులకే సదరు పంచాయతీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుగా కడుతున్న గోడ నిర్మాణాన్ని తొలగించి రహదారిని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఇందిరగాంధీ దళిత సంఘం మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

త్వరలో ఫలితాలు

జగిత్యాల: జగిత్యాల జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్ల ఎంపిక కోసం ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించామని, గణితం, ఆంగ్లం, ఫిజికల్ డైరెక్టర్, తెలుగు ఎక్కువగా దరఖాస్తులు రావడంతో జిల్లా విద్యాశాఖలో డెమో నిర్వహించి డీఆర్పీలను ఎంపిక చేశామని, త్వరలోనే ఫలితాలు ప్రకటిస్తామని డీఈవో రాము తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వేసవిలో జరిగే ఉపాధ్యాయుల శిక్షణ కోసం వీరిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై జగిత్యాల సీసీఎస్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతుపకప ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,570 స్వాధీనం చేసుకుని రాయికల్ పోలీసులకు అప్పగించినట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు.

జిల్లా కేంద్రంలోని భవానినగర్‌లోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతుండగా జగిత్యాల సీసీఎస్ పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసులకు అప్పగించగా, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

'ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే బీఆర్‌ఎస్ సభ సక్సెస్'

సారంగాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతతోనే తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ పాలన వైపు చూస్తున్నారని, అందుకే ఎల్కతుర్తి సభ సక్సెస్ అయిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు అన్నారు. సోమవారం మాట్లాడారు. సభ విజయవంతం కావడంతో జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ మంత్రులు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అనంతుల గంగారెడ్డి, చుక్క అంజి, బండారి వెంకటేష్, వొడ్నాల జగన్, తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలు విజయవంతం చేయాలి

పెగడపల్లి: మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం మేడే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్ట రాజ్యాంగం ప్రకారం కల్పించిన కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు, పని భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్ పెన్షన్ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టి పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శనగరపు ప్రవీణ్, సురేశ్, శేఖర్, గంగాధర్, కమలాకర్, శంకరయ్య, మధు, రాజేశం, మల్లయ్య, ఆనందం, ప్రదీప్, లింగయ్య, సంతోష్ పాల్గొన్నారు.

డ్రైయినేజీ, సీసీరోడ్డు పనులు ప్రారంభం

కథలాపూర్: మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు డ్రైయినేజీ, సీసీరోడ్డు పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ పనులకు గాను ప్రభుత్వం రూ. 1.30 కోట్లు మంజూరు చేసిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు కల్లెడ గంగాధర్, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లేశ్‌యాదవ్, బండి సత్తన్న, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే1 నుంచి 31వ తేదీ వరకు ఉచిత వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కోచ్ ప్రతాప్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 94409 22296 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాడే వితరణ

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామానికి చెందిన బైరవేని సత్యనారాయణ గౌడ్ తన తండ్రి బైరవేని ఆంజనేయులుగౌడ్ జ్ఞాపకార్థం స్టీల్‌తో తయారుచేసిన పాడెను అందించారు. ఈ మేరకు బీర్‌పూర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రవికి సోమవారం అందించాడు. ఆంజనేయులు బీర్‌పూర్ గ్రామానికి సుదీర్ఘకాలం ఉపసర్పంచ్‌గా, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి అనేక కార్యక్రమాలను నిర్వహించాడు. ఈ సందర్భంగా సత్యనారాయణను గ్రామస్తులు అభినందించారు.